క్లుప్తంగా

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత

నిర్మల్‌టౌన్: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను తిరిగి అప్పగించి నిర్మల్ ఆర్టీసీ డ్రైవర్ నిజాయతీ చాటుకున్నాడు. ఆదివారం హైదరాబాద్ నుంచి నిర్మల్‌కు బస్సులో వచ్చిన ఓ మహిళ బస్సు దిగే క్రమంలో సీటులో ఫోన్ మరిచిపోయింది. డ్రైవర్ మొహినొద్దీన్ బస్సు తనిఖీ చేస్తుండగా సీటుపై సెల్‌ఫోన్ కనిపించింది. ఫోన్ నెంబర్ ఆధారంగా సదరు మహిళా ప్రయాణికురాలిని బస్టాండ్‌కు పిలిపించారు. అసిస్టెంట్ మేనేజర్ రాజశేఖర్ సదరు ఫోన్‌ను ఆ మహిళకు అందజేశారు.

ఇష్టపడి చదివితే మంచి భవిష్యత్తు

కుంటాల: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితేనే మంచి భవిష్యత్తు ఉంటుందని పద్మశాలి సంఘం మండల కన్వీనర్ గుద్దేటి గంగాధర్ పేర్కొన్నారు. ఇటీవల గురుకుల పీఈటీ ఫలితాల్లో కుంటాలకు చెందిన ఎనుగందుల సాగర్ ఉద్యోగం సాధించారు. ఆదివారం మండల కేంద్రంలోని పద్మశాలి సంఘం భవనంలో సాగర్‌కు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జక్కని గజేందర్, పల్లికొండ గజేందర్, భోగ గోవర్ధన్, రాములు, భోజన్న, కుర్ర నవీన్, శ్రావణ్, గజేందర్ తదితరులు పాల్గొన్నారు.

గజ్జలమ్మదేవికి పూజలు


పూజలు చేస్తున్న భక్తులు

కుంటాల: కుంటాల ఇలవేల్పు శ్రీ గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి ఆలయాల్లో ఆదివారం భక్తులు పూజలు నిర్వహించారు. అర్చకుడు నగేశ్, గురుస్వామి జక్కని గజేందర్ ఆధ్వర్యంలో గజ్జలమ్మదేవికి అభిషేకం, అలంకరణ, అర్చన, హారతి, పల్లకిసేవ చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేశారు.

పీఆర్టీయూ మండలాధ్యక్షుడికి సన్మానం

నర్సాపూర్(జి): పీఆర్టీయూ టీఎస్ మండల అధ్యక్షుడిగా ఎన్నికైన గంగాచరణ్‌ను ఆదివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గడ్డం ఇంద్రకరణ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు అజీమ్, పలువురు నాయకులు గోపిడి గంగారెడ్డి, ఆయిటి మహేశ్, కాల్వ రఘు, దొర రాజు ఉన్నారు.

శివాజీ విగ్రహావిష్కరణ


ఆవిష్కరణలో పాల్గొన్న నాయకులు


లక్ష్మణచాంద: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన శివాజీ విగ్రహాన్ని ఆదివారం మండల నాయకులు, గ్రామస్తులు, యూత్ సభ్యులు సంయుక్తంగా ఆవిష్కరించారు. యూత్ సభ్యులు ర్యాలీగా వచ్చి విగ్రహావిష్కరణలో పాల్గొన్నారు. కార్యక్రమంలో అద్వాల రమేశ్, సురకంటి ముత్యంరెడ్డి, వోస రాజేశ్వర్, ఈటెల శ్రీనివాస్, బిట్లింగ్ రజనీకాంత్, శ్రీకాంత్, సుంకరి శ్రీనివాస్, రాంరెడ్డి, రాజేశ్వర్, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సన్మానం


సన్మానిస్తున్న ఉద్యోగులు

కుంటాల: ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని జంగయ్య(పొన్కల్ జెడ్పీ పాఠశాల), లక్ష్మణ్ (డ్యాంగపూర్ ఆశ్రమ పాఠశాల), రాజశ్రీ(పాంగ్రి ప్రాథమిక పాఠశాల) ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్నారు. కాగా వీరిని ఆదివారం కల్లూరులో ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో ముత్యం, ఉద్యోగులు సుధాకర్, వెంగళరావు, గట్టుపల్లి నవీన్, ప్రదీప్, జి.నవీన్, సారిక, సంధ్యారాణి, సాయినాథ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'ఫోన్‌ఇన్'


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జు

ఉట్నూర్‌రూరల్: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను నేరుగా ప్రజల నుంచి తెలుసుకొని పరిష్కరించడమే లక్ష్యంగా ఫోన్‌ఇన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. ఆదివారం ఉట్నూర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఫోన్‌ఇన్ కార్యక్రమం చేపట్టారు. ఉట్నూర్, జన్నారం, కడెం, పెంబి, ఇంద్రవెల్లి మండలాలప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులు, సీసీరోడ్డు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.

బొజ్జ గణపయ్య.. వీడ్కోలయ్యా

- గంగమ్మ ఒడికి చేరిన లంబోదరుడు
- వీధుల్లో శోభాయాత్ర నిర్వహించి నృత్యాలు చేసిన భక్తులు


ఖానాపూర్‌లో ..


నర్సాపూర్(జి): రాంపూర్‌లో వినాయకుడి శోభాయాత్రలో మంగళహారతులతో భక్తులు


భైంసారూరల్: మహాగాంలో యువకుల సందడి


కుంటాల: పెంచికల్‌పాడ్‌లో గణనాథుడిని నిమజ్జనం చేసేందుకు వెళ్తున్న గ్రామస్తులు


ముధోల్: గన్నవరంలో నిమజ్జనం చేస్తున్న భక్తులు


లోకేశ్వరం : పంచగుడిలో మండపం వద్ద భక్తులు

నర్సాపూర్(జి): మండలంలోని రాంపూర్ గ్రామంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశుడి నిమజ్జనం ఆదివారం నిర్వహించారు. వీధుల గుండా డప్పుచప్పుళ్ల నడుమ శోభాయాత్ర చేపట్టగా మహిళలు మంగళహారతులతో పాల్గొన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని బాలల గణేశ్ నిమజ్జనోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం వీధుల్లో డప్పుచప్పుళ్ల నడుమ శోభాయాత్ర సాగింది. యువకులు నృత్యాలు చేస్తూ సందడిగా గడిపారు. గోదావరి తీరం వరకు ఊరేగింపుగా వెళ్లి నిమజ్జనం చేశారు.

ముధోల్: మండలంలోని బోరిగాం, బ్రహ్మన్‌గావ్, గన్నవరం గ్రామంలో ఆదివారం వినాయక నిమజ్జనోత్సవాలు ఘనంగా నిర్వహించారు.

కుంటాల: మండలంలోని అంబకంటి, పెంచికల్‌పాడ్, దౌనెల్లి, దౌనెల్లితండా, కుంటాల, మెదన్‌పూర్, అందాకూర్ గ్రామాల్లో ఆదివారం భక్తి శ్రద్ధలతో వినాయకుత నిమజ్జనం నిర్వహించారు. పెంచికల్‌పాడ్‌లో భజనలు చేస్తూ శోభాయాత్రగా వెళ్లి చెరువులు, వాగుల్లో ప్రతిమలను నిమజ్జనం చేశారు. ఎస్సై సీహెచ్.భాస్కరాచారి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

భైంసారూరల్: మండలంలోని మహాగాం, కుంబి గ్రామాల్లో ఆదివారం వినాయక నిమజ్జనం నిర్వహించారు. వీధుల గుండా సాగిన శోభాయాత్రలో యువకులు నృత్యాలు చేస్తూ సందడిగా గడిపారు. మహిళలు మంగళహారతులతో వేడుకలో పాల్గొన్నారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భైంసారూరల్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

లోకేశ్వరం: మండలంలోని పంచగుడి, మన్మద్, రాజూర, గడ్‌చాంద గ్రామాల్లో ఆదివారం వినాయకుల నిమజ్జనం నిర్వహించారు. వీధుల్లో సాగిన శోభాయాత్రలో భక్తులు నృత్యాలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా లోకేశ్వరం పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల్లో వీడీసీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

దండాలయ్యా.. ఉండ్రాలయ్యా


కుంటాల: విఠాపూర్‌లో జడ్జి రాధిక పూజలు

- కొనసాగుతున్న నవరాత్రి ఉత్సవాలు


సోన్: న్యూబొప్పారంలో వేలంలో లడ్డూ దక్కించుకున్న గౌతమ్‌రెడ్డి దంపతులు


కడెం: పెద్దూర్ సాయినగర్‌లో కుంకుమపూజలు


దస్తురాబాద్‌లో కుంకుమపూజ చేస్తున్న భక్తులు

కుంటాల: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్మల్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి జి.రాధిక మండలంలోని విఠాపూర్ గ్రామంలో శనివారం రాత్రి వినాయకుడి మండపం వద్ద పూజలు చేశారు. ఈసందర్భంగా గ్రామస్తులు వారిని సన్మానించారు.

దస్తురాబాద్:మండల కేంద్రంలోని పోచమ్మవాడలోని ఏర్పాటు చేసిన గణేశుడి మండపం వద్ద ఆదివారం పంతులు కొండమచార్యుల ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఈసందర్భంగా మహిళలు కలశ, గణపతి, గౌరి, కుంకుమ పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

కడెం: మండలంలోని పెద్దూర్ సాయినగర్ గణేశ్ మండపం వద్ద ఆదివారం కుంకుమపూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ఖానాపూర్: పట్టణంతోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం వేదపండితులు పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదం అందజేశారు.

సోన్: మండలంలోని న్యూబొప్పారం గ్రామంలో వీడీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి నిమజ్జనం ఆదివారం నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన వీడీసీ సభ్యుడు పెద్దోల్ల గౌతమ్‌రెడ్డి దంపతులు వినాయకుడి లడ్డూను రూ.ఐదు వేలకు వేలంపాటలో దక్కించుకున్నారు. వీడీసీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

దాహం తీర్చని ఆర్వోప్లాంట్లు

- నిర్వహణ మరిచిన అధికారులు
- తాగునీటికి గోస పడుతున్న ప్రజలు
- తానూరు మండలంలో సరఫరా కాని భగీరథ జలం


బెంబరలో పనిచేయని శుద్ధజలమణి పథకం


దాగాం గ్రామంలో నిరుపయోగంగా తాగునీటి పథకం

తానూరు: గ్రామీణ ప్రాంత ప్రజలకు శుద్ధజలం అందించేందుకు 2008లో అప్పటి ప్రభుత్వం సుజలాం–సుఫలాం పథకం కింద తానూరు మండలంలోని ఆరు గ్రామాల్లో ఆర్వో ప్లాంట్లు (రివర్స్ ఆస్మోసిస్)ఏర్పాటు చేసింది. కొన్ని రోజులు పని చేసిన ఈ ప్లాంట్లు తర్వాత వివిధ కారణాలతో నిరుపయోగంగా మారాయి. అధికారులు ప్లాంట్ల నిర్వహణను పట్టించుకోకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలకు శుద్ధజలం మున్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోయింది. మరోవైపు గత ప్రభుత్వం ఇంటింటికీ తాగునీరు అందించేందుకు ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ పథకం తానూరు మండలంలో కానరావడం లేదు.

నిర్వహణ బాధ్యత పంచాయతీలదే..

అప్పటి ప్రభుత్వం తానూరు మండలంలోని తానూరు, దాగాం, సింగన్‌గాం, బెంబర, ఎల్వి తోపాటు భోసి గ్రామాల్లో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసి వాటి నిర్వహణ బాధ్యతలను పంచాయతీలకు అప్పగించింది. గ్రామపంచాయతీ వారు క్యాన్‌కు రూ.5 నామమాత్రపు రుసుం తీసుకుంటూ ప్రజలకు తాగునీటిని అందించేవారు. ప్రభుత్వం నుంచి వచ్చే అరకొర నిధులు ప్లాంట్ల విద్యుత్ బిల్లులు, నిర్వహణకు సరిపోకపోవడంతో పంచాయతీవారు చేతులెత్తేశారు. దీంతో ప్రస్తుతం ప్లాంట్లు భోసి గ్రామంలో మాత్రమే పనిచేస్తుండగా మిగతా ఐదు గ్రామాల్లో నిరుపయోగంగా మారాయి. వర్షాకాలంలో కలుషిత నీరు తాగి రోగాల బారిన పడుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి ప్లాంట్‌లకు మరమ్మతులు చేయించి శుద్ధజలం వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

గ్రామాల వారీగా..

- బెంబరలో రూ.6 లక్షలతో ప్లాంట్ ఏర్పాటు చేశారు. దీనికి బోరుబావి లేక నీరు సరిగా పనిచేయడం లేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. దీంతో ఇతర గ్రామాల నుంచి మినరల్ వాటర్ తెచ్చుకుంటున్నామని అంటున్నారు.
- సింగన్‌గాంలో రూ.4.50 లక్షలతో ఏర్పాటు చేసిన తాగునీటి పథకానికి మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్లాంట్ నిరుపయోగంగా మారింది.
- తానూరులో రూ.6 లక్షలతో ఏర్పాటు చేసిన ఈప్లాంట్‌ను కనీసం విద్యుత్ బిల్లులు, మరమ్మతులు చేయించేందుకు కూడా ఆదాయం రావడం లేదనే సాకుతో అధికారులు మూసివేయించారు. దీంతో ప్రజలు ప్రైవేటు యజమానుల నుంచి క్యాన్‌కు రూ.15 చెల్లించి తాగునీటిని తెచ్చుకుంటున్నారు.
- దాగాం గ్రామంలో నిర్వహణ లేకపోవడంతో పథకం నిరుపయోగంగా మారింది.దీంతో ఇక్కడి గ్రామాల ప్రజలు శుద్ధిజలం కోసం ముధోల్ వెళ్లి తీసుకువస్తున్నారు.

కొన్నాళ్లే నడిచింది



బెంబరలో ఏర్పాటు చేసిన ఆర్వోప్లాంటు కొన్నాళ్లు పని చేసింది. ప్లాంట్‌కు బోరు బావి లేక పథకం పని చేయడం లేదని నిర్వాహకులు అంటున్నారు. పక్క గ్రామాలకు వెళ్లి మినరల్ వాటర్ తెచ్చుకుంటున్నాం. అధికారులు బోరు వేసి మాకు తాగునీటిని అందించాలి. – శంకర్, బెంబర

వినియోగంలోకి తీసుకొస్తాం

గ్రామాల్లో శుద్ధ జలమణి పథకాలు నిరుపయోగంగా ఉన్న మాట వాస్తవమే. ఈ తాగునీటి పథకాలకు విద్యుత్ బిల్లులు, మరమ్మతుల కోసం పంచాయతీలకు ప్రత్యేకంగా నిధులు రావడం లేదు. పంచాయతీ సిబ్బందితో వివరాలు సేకరించి ప్లాంట్లకు మరమ్మతులు చేపట్టి ప్రజలకు శుద్ధజలం అందేలా చర్యలు తీసుకుంటాం. – నసీరొద్దీన్, ఎంపీవో

- ఎల్వి గ్రామంలో నీటి సరఫరా లేక ఈ తాగునీటి పథకం నిరుపయోగంగా మారింది. ప్లాంట్‌కు మరమ్మతు చేసి తమకు తాగునీరు అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

'17న విద్రోహ దినంగా పాటించాలి'

- సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి కె.రాజన్న


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నిర్మల్‌ఖిల్లాగేట్: ఈనెల 17వ తేదీ విలీనం, విమోచన దినోత్సవంగా కాకుండా విద్రోహ దినంగా పాటించాలని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి కె.రాజన్న అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని భగత్‌సింగ్ భవన్‌లో సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ పార్టీ జిల్లా కార్యాలయంలో తెలంగాణ సాయుధ పోరాటాల వారోత్సవాల సదస్సు నిర్వహించారు. దీనికి సంబంధించిన కరపత్రాలను నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కె.రాజన్న మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి నుంచి విముక్తి కోసం 1946 నుంచి 1951 వరకు భూస్వాములపై తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం జరిగిందన్నారు. ఈ పోరాట ఫలితంగా ప్రజలకు బానిసత్వం నుంచి విముక్తి కలిగి ప్రజలకు 10 లక్షల ఎకరాల భూమిని పంపిణీ చేశారన్నారు. కౌలు రైతులకు హక్కులు కల్పించారన్నారు. సాయుధ పోరాటంలో 4,000 మంది గెరిల్లా యోధుల త్యాగాలతో కమ్యూనిస్టు వీరుల రక్తంతో తెలంగాణ నేల పులకించిందన్నారు. రైతాంగ పోరాటాన్ని నీరుగార్చేందుకు కమ్యూనిస్టు పార్టీని, దాని నాయకత్వాన్ని దెబ్బ తీయాలనే ఉద్దేశంతో నాటి నిజాం రాజు– ప్రధాని నెహ్రూ మధ్య జరిగిన ఒప్పందంతో భారత సైన్యాలు సెప్టెంబర్ 17న తెలంగాణకు వచ్చాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కె.సాయన్న, కె.కిషన్, ఆనంద్, లక్ష్మణ్, వర్మ, ప్రభాకర్ పాల్గొన్నారు.

బీసీ కమిషన్ సభ్యురాలికి సన్మానం


బాలలక్ష్మిని సన్మానిస్తున్న నాయకులు

నిర్మల్‌ఖిల్లాగేట్: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం బీసీ కమిషన్ సభ్యురాలిగా నియమించిన ఓయూ జేఏసీ నేత, తెలంగాణ ఉద్యమకారిణి రంగు బాలలక్ష్మిగౌడ్‌ను ఆదివారం గౌడజన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ, జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా నాయకులు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మోకుదెబ్బ జాతీయ అధ్యక్షులు అమరవేణి నర్సాగౌడ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు అనుముల భాస్కర్, నాయకులు దరూరి యోగానంద చారి, రంగు శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

కాషాయ జెండాలతో అలంకరణ


బుధవార్‌పేట్‌లో గోపూజ చేస్తున్న నాయకులు

నిర్మల్‌టౌన్: పట్టణాన్ని నిర్మల్ నగర గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఆదివారం కాషాయజెండాలతో అలంకరించారు. మంగళవారం నిర్వహించే నిమజ్జన శోభాయాత్రను పురస్కరించుకొని శివాజీచౌక్ నుంచి బస్టాండ్, బుధవార్‌పేట్, గాంధీచౌక్, బెస్తవార్‌పేట్, వినాయక సాగర్ వరకు కాషాయ జెండాలను ఏర్పాటు చేశారు. అనంతరం స్థానిక బుధవార్‌పేట్ నాలుగో నంబర్ వినాయకుడి వద్ద గోపూజ నిర్వహించారు. కార్యక్రమంలో గణేశ్ ఉత్సవ సమితి అధ్యక్షుడు ముప్పిడి రవి, ప్రధాన కార్యదర్శి మురళి, కోశాధికారి ప్రభు, శివప్రసాద్, రాకేశ్, గవాస్కర్, రమేశ్, గంట రాకేశ్, ఆదుముల్ల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

బస్సుల్లో ఇబ్బందుల్లేకుండా చూడాలి


సంతకాలు సేకరిస్తున్న నాయకులు

ఖానాపూర్: ఆర్టీసీ బస్సుల్లో పెరిగిన ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా కొత్త బస్సులు ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని పీవోడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.లక్ష్మి, జిల్లా అధ్యక్షురాలు ఎస్.సమత అన్నారు. పీవోడబ్ల్యూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆదివారం పట్టణంలోని బస్టాండ్‌లో ప్రయాణికుల నుంచి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. పెరిగిన రద్దీతో వృద్ధులు, దివ్యాంగులు, చిన్నారులు నానావస్థలు పడుతున్నారని అన్నారు. ఆర్టీసీ బస్సుల టైర్లు ఊడిపోతున్నాయని.. వెంటనే కొత్త బస్సులు, కొత్త ఉద్యోగాలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో రామయ్య, లక్ష్మి, విజయ, సునీత తదితరులు ఉన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు


గాంధీనగర్‌లో సభ్యత్వ నమోదులో పాల్గొన్న బీజేపీ నాయకులు

సోన్: మండలంలోని మాదాపూర్, పాక్‌పట్ల, గాంధీనగర్ గ్రామాల్లో ఆదివారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్ మాట్లాడారు. ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించి.. పార్టీలో సభ్యులుగా చేర్చాలని కార్యకర్తలకు సూచించారు. మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత బీజేపీదని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మేకల అశోక్, నాయకులు మార గంగారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, ఉదయ్, నాగరాజు, గంగారెడ్డి, రమేశ్, కల్యాణ్, గణేశ్, అంజయ్య, నాగరాజు, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. పారిశుధ్యంపై పట్టింపేది..?



నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని ఒకటో వార్డులో దేవునిచెరువుకు వెళ్లే దారిలో పారిశుధ్యం అధ్వానంగా మారింది. పూడిక తీయకపోవడంతో పిచ్చిమొక్కలు పెరిగి మురుగు కాల్వ ఆనవాళ్లు కోల్పోయింది. మురుగునీరు నిలువడంతో దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: తిరుపతిరెడ్డి, నర్సాపూర్(జి) ప్రత్యేకాధికారి, ఫోన్: 99481 11574